ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (హైదరాబాద్‌లో శ్రీనాన్నగారి ప్రవచనము, 3-11-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎంతకాలమైతే మనం దేహముమాత్రమే సత్యం అనుకొంటున్నామో, నేను అనేటప్పటికి హృదయంలో ఉన్న చైతన్యంకాకుండా కేవలము దేహమే మనకు స్ఫురిస్తోందో అంతకాలము మనం జననమరణప్రవాహమునుండి ఒడ్డుకు రాలేము. మీకు దేహబుద్ధి ఉన్నంతకాలం బాధలు, కష్టాలు, నష్టాలు అన్నీ మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాయి. మీరు పూజలు, జపాలు చేస్తున్నారు. పూజలపేరుమీద, జపాలపేరుమీద మీదేహబుద్ధిని పెంచుకోవద్దు. పూజ, జపం, ధ్యానం, విచారణ ఇవిఅన్నీ దేహబుద్ధినుండి వేరుపడటానికే. మీరు చేసేపనులు ఎందుకు చేస్తున్నారో తెలుసుండి చెయ్యండి. జన్మించినవాడు మరణిస్తాడుఅని మనకు తెలుస్తోంది. కాని మరణించినవాడు తిరిగి జన్మిస్తాడుఅని మనకు తెలియటంలేదు. ఇది ఎంతనిజమోఅదికూడా అంతేనిజం. మన హృదయంలో ఉన్ననిజం తెలిసేవరకూ మనం మనంగా ఉండలేము. మనంమనంగా ఉండలేనంతకాలం మనకు స్వేచ్ఛలేదు, సుఖంలేదు, శాంతిలేదు. మీకు జ్ఞానంకావాలంటే కారులమీద, విమానాలమీద, ఓడలమీద తిరగనక్కరలేదు. ఇలా ప్రయాణాలుచేసి పొందేదికాదు. ఆ శ్రమ మీకు అక్కరలేదు. జ్ఞానం మీహృదయంలో ఉంది. మీహృదయంలో వెతికితే అది దొరుకుతుంది.

ఒకభక్తుడు భగవాన్‌దగ్గరకువచ్చి నాకు ఉపదేశం చేయండి అనిఅడిగాడు. ఎవరూలేకుండా చూసిరాఅని భగవాన్ చెప్పారు. రెండురోజులు చూసాడు. భగవాన్‌దగ్గర ఎవరోఒకరు ఉంటున్నారు. అందువలన రాత్రిసమయంలో భగవాన్ ఒంటరిగా ఉన్నప్పుడు వెళ్ళి మీరు ఎవరూలేకుండా రమ్మన్నారు, ఇప్పుడు వచ్చాను అనిచెప్పాడు. ఇప్పుడు ఎవరూలేరా అని భగవాన్ అడిగారు. ఎవరూలేరు నేను ఉన్నాను అన్నాడు. ఆనేనుపోయిన తరువాత రా ఉపదేశం చేస్తాను అన్నారు భగవాన్. ఆనేనుపోయిన తరువాత వాడికి సృష్టే ఉండదు. ద్వైతం ఉండదు. ఇంక ఉపదేశంపొందవలసిన అవసరం ఏమిఉంటుంది. మనస్సు తనమూలాన్ని చూస్తేగాని అదినశించదు. దేహానికి పరిమితంచేసేది మనస్సుమాత్రమే. మనస్సునశిస్తే లోపలఉన్న పరమేశ్వరుడు, సృష్టికర్త నీకు నేనుగా వ్యక్తమవుతాడు. ఈ మనస్సు నిజంఅని మనం నమ్ముతున్నాము. మనం ఏదైతే కాదో ఏదోఒకరోజు దానిలోనుండి వేరుపడాలి. మనకి ఆస్తులు ఉండవచ్చు. అవిమనవేకాని అవి మనంకాదు అందువలన వాటిలోనుండి వేరుపడాలి. ఈదేహం, ఇంద్రియాలు నావేఅయినప్పటికీ అవినేనుకాదు అందువలన వాటిలోనుండి వేరుపడాలి. హృదయంలో ఉన్ననిజం తెలుసుకొనేవరకూ నిజంకానిదానిని నిజంఅనిఅనుకొంటూఉంటావు. అనిజం నిన్ను వెంటాడుతుంది. నీహృదయంలోఉన్న దేవుడు నిజం. గుడిలోను, కైలాసంలోను దేవుడు ఉన్నాడు. నీదేహం ఎంతనిజమో వారుకూడా అంతేనిజం. నీహృదయంలోఉన్న నిజానికి వీటితో అణుమాత్రంకూడా సంబంధంలేదు. అయితే హృదయంలోఉన్న దేవుని తెలుసుకోవటం

ఎలాగఅని భగవాన్‌ను అడుగుతున్నారు. నీ శరీరం ఏదోరోజు మరణిస్తుంది. కాని నీశరీరానికి మరణంరాకముందే నీవు మరణించాలి. అంటే నీదేహబుద్ధి నశించాలి. ఒకపండితుడు నేను వేదాలు చదివాను, శాస్త్రాలను అధ్యయనం చేసానుఅని భగవాన్‌తో అన్నారు. శాస్త్రాలలో ఆత్మలేదు. ఆత్మ నీహృదయంలో ఉంది. శాస్త్రాలను అధ్యయనంచేస్తే నీకు సన్మానాలు చేస్తారు, గొప్పలువస్తాయి. ఈ గొప్పలు, సన్మానాలు నీహృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి అడ్డుగా నిలబడతాయి. అయితే నన్నుఏమిచేయమంటారుఅని అడిగితే నువ్వు శాస్త్రాలను ఏవిధంగాఅయితే అధ్యయనం చేస్తున్నావో అలాగ నిన్ను నీవు అధ్యయనంచేసుకో. అలాగచేస్తే నీవుఎవరో నీకు తెలుస్తుంది అన్నారు. నన్నునేను అధ్యయనంచేసుకోవటం ఎలాగఅని భగవాన్‌ను అడిగారు. నువ్వు ఎవడిగాఉన్నావో వాడిగా ఉండిపో అంటే నువ్వుఆత్మగా ఉండటమే నిన్నునీవు అధ్యయనంచేసుకోవటం. నీవు దేహంఅనుకొన్నప్పుడు ఆత్మవే, నీవు మనస్సుఅనుకొన్నప్పుడు ఆత్మవే. అందువలన ఆత్మగాఉండు. నిన్నునీవు అధ్యయనంచేసుకొంటే నీవునీవుగా ఉండగలవు. నీవునీవుగా ఉంటే జ్ఞానంగా, వెలుగుగా, శాంతిగా ఉంటావు.

నన్నునేను తెలుసుకొందామని అనుకొంటున్నానుఅని ఒక భక్తుడు భగవాన్‌తో అన్నాడు. నన్ను నేను తెలుసుకొంటాను అంటున్నావు నీవు ఒకటిగా ఉన్నావా? రెండుగా ఉన్నావా? ఎవరిని ఎవరితో తెలుసుకొంటావు. నీవు రెండుగా ఉంటే ఒకరిని ఇంకొకరితో తెలుసుకొంటావు. నీవు రెండుగా లేవు, ఒకటిగా ఉన్నావు. ఈబేదబుద్ధి నీమనస్సుయొక్క కల్పితం. మనంఅందరము గుణాలలో, రంగులలో, రూపాలలో వేరుగాఉన్నాముకాని హృదయంలో ఒకటిగా ఉన్నాము. ఒకటిగా ఉన్నాముఅన్నసంగతి మనకు ఎందుకు తెలియటంలేదు అంటే బేదబుద్ధివలన తెలియటంలేదు. అహంభావనలోనుండి బేధదృష్టి కలుగుతోంది. యోగంఅంటే ఐక్యమవ్వటం. దేనిలో ఐక్యమవుతావు అంటారు భగవాన్. ఈనేను ఎవరో విచారణచెయ్యి. అప్పుడు లేనివిషయం లేనట్లుగా నీకు తెలుస్తుంది. లేనివిషయం లేనట్లుగా నీకుఎప్పుడైతే తెలిసిందో ఉన్నవిషయం తానుగా నీకువ్యక్తమవుతుంది. ఈనేనును సందేహించు. నేనుఅని ఈదేహం చెప్పటంలేదు. నీలోపల మనస్సో, జీవుడో ఏదో చెపుతోంది. నీలోపల నేనుగావ్యక్తమయ్యే ఆనేను ఎవరు? ఆనేను ఎవడో తెలియకుండా దేవుడు ఎవడోకూడా నీకు తెలియదు. వేలాది జన్మలనుండి ఇదే నిజంఅని నమ్ముతున్నాము. నీవు బలమైన విచారణ చేయలేకపోయినా కనీసం ముందుదానిని సందేహించు. ఈజన్మలోగాని, రాబోయే జన్మలోగాని ఇదివేరుతో నశిస్తేగాని నీవుఎవరో నీకు తెలియదు. నీశరీరంలో మార్పులు వస్తూఉంటాయి, నీమనస్సులో మార్పులు వస్తూఉంటాయి. నీఅహంభావనలో మార్పులు వస్తూ ఉంటాయి. ఈమారేది ఏదీనిజంకాదు. మార్పులేనిది నీహృదయంలో ఉంది. నీహృదయంలోఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి ఏదైతే అడ్డుగా వస్తోందో అందులోనుండి విడిపోవటమే నీసాధనయొక్క లక్ష్యం. ఈదేహంనుండి, మనస్సునుండి విడిపోవటంఅంత తేలికకాదు. దీనికి నీతెలివితేటలు సరిపోవు. గురువు అనుగ్రహం ఉండాలి. తెలివైనవాడు తెలివితో తాదాప్యం పొందుతాడు. తెలివిలేనివాడు డబ్బుతోటి, దేహంతోటి తాదాప్యం పొందుతాడు. ఈతాదాప్యములనుండి విడిపోయినవెంటనే నీవు ఎవరో నీకు తెలుస్తుంది. నీవు ప్రయత్నంచేస్తూఉంటే దేవుని సహాయం నీకు అందుతుంది. గురుభక్తికలిగిఉండండి. గురుభక్తి దైవభక్తికి దారిచూపిస్తుంది. కనిపించే గురువుమీద

భక్తిలేనపుడు కనిపించని దేవునిమీద భక్తిఉందిఅంటే ఎలా కుదురుతుంది. గురువునిన్ను దేవునిదగ్గరకు తీసుకొనివెళతాడు. వీడిమీద నీకు నమ్మకం లేనపుడు కనిపించనిదేవునిమీద నమ్మకం ఎలాకుదురుతుంది. సజ్జనులతో సహవాసంచేస్తే మీకు అన్నీవస్తాయి. జ్ఞానంకూడా వస్తుంది. దుష్టసహవాసంచేస్తే దుష్టసంస్కారములు, నీచజన్మలు వస్తాయి. మనకు 100మందితో స్నేహంఅక్కరలేదు. ఒక్కజ్ఞానితో స్నేహం సరిపోతుంది. ఒకమహాగురువుతో మానసికఅనుబంధంపెట్టుకోండి. మానసికఅనుబంధంవలన నీమనస్సు హృదయంయొక్క లోతులలోనికివెళ్ళి అక్కడ అణిగిపోతుంది.

ఈ ప్రపంచంఅంతా ఆత్మలోఉంది. ఆత్మానుభవంపొందినతరువాత ఆత్మకంటే వేరుగా ఏమీలేదుఅని తెలుస్తుంది. దృశ్యబుద్ధిలోనుండి వేరుపడితే ఉన్నదిఉన్నట్లుగా వ్యక్తమవుతుంది. ఏదినిజమో నీకు తెలియకపోవచ్చు. దానివలన ప్రమాదంలేదు. నిజంకానిదానిని నిజంఅనుకొంటున్నావు. దానివలన సంసారప్రవాహములో పడిపోతున్నావు. ఏరోజు మరణం వస్తుందో మనకు తెలియదు. మరణించిన తరువాత సాధనచేయటానికి అవకాశంలేదు. మరలదేహంవస్తేగాని సాధనకు అవకాశంలేదు. నిద్రపోయేటప్పుడు 45వ పేజీవరకు చదివి పడుకొంటే ఉదయం 46వపేజీనుండి మొదలుపెడతాముగాని 50వ పేజీకి వెళ్ళము. నిద్రలోకొంత చదవటానికి అవకాశంలేదు. అలాగే మరణానంతరము సాధనకు అవకాశంలేదు. సాధనచేయటానికి మరలదేహం రావాలి. అందువలన కాలమును వ్యర్థంచేసుకోవద్దు. పొందవలసిన వస్తువుకోసం ప్రయత్నంచేయండి. చేతులుజోడిస్తే అది ప్రార్థనకాదు, చప్పట్లువస్తాయి. సహనం కలిగిఉంటే, వినయం కలిగిఉంటే అదే దేవునికి నిజమైన ప్రార్థన.

అరుణాచలంఅంటే బ్రహ్మమే. చర్మనేత్రాలతో చూస్తేఅది రాళ్ళగుట్టలాగ కనబడుతుంది. లోపలచైతన్యస్థాయి పెరిగినవారికి అది అనుగ్రహస్వరూపంగా కనిపిస్తుంది. అది అంతటా వ్యాపించిఉన్నదని తెలుస్తుంది. గురువుయందు మనకు ఆకర్షణ కలిగేటట్లు ప్రేమకలిగేటట్లు ఆయనచేసుకోవాలికాని అది మనవల్లకాదు. నీమనస్సు ప్రకృతిగుణాలతో తాదాప్యం చెందుతోంది. ఆగుణాలనుండి నీమనస్సును విడదీస్తే దానిని హృదయం ఆకర్షించుకొంటుంది. ఏదోఒకటి చింతించకుండా నీమనస్సు ఉండలేదు. దానికి ఏదోఒక మేటర్‌కావాలి, ఆలంబన కావాలి. విషయచింతనతో దానికి ఉన్న అనుబంధం ఎప్పుడైతే తెగిపోయిందో అప్పుడు హృదయం దానిని లోపలకు గుంజుకొంటుంది, ఆత్మచింతన నేర్పుతుంది. హృదయంలోదానిని ముంచటం, ఉంచటమే కావలసింది, కరగదీసేపని హృదయమే చేస్తుంది. కరగదీసి వూరుకోదు, దానిస్వరూపాన్ని ఇస్తుంది. చూచేవాడు ఎంతనిజమో చూడబడేదికూడా అంతేనిజం. నేను మిమ్మల్ని చూస్తున్నానుఅంటే నాకళ్ళు చూస్తున్నాయా? లేదు ఈకళ్ళద్వారా చూసేవాడు ఒకడు లోపల ఉన్నాడు. వాడిని జీవుడుఅనండి, మనస్సు అనండి ఏదోపేరు పెట్టండి. వాడుచూస్తున్నాడు. వాడు హృదయంలో ఎప్పుడైతే అణిగిపోయాడో ఈ ఆకారాలు, వికారాలు, దృశ్యాలుఅన్నీ అణిగిపోతాయి. అప్పుడు ఏదృశ్యం నిన్నుబంధించదు. మీకు జ్ఞానంకలిగాక ఇవిఅన్నీ ఎక్కడికయినా వెళ్ళిపోతున్నాయాఅంటే ఎక్కడికి వెళ్ళవు. నీమనస్సు ఎక్కడయితే అణిగిపోయిందో అక్కడే ఇవిఅన్నీ అణిగిపోతున్నాయి. కిర్సనాయిల్ డబ్బాలో కిర్సనాయిలు తీసివేసాము అనుకోండి. పేరుకు కిర్సనాయిలు డబ్బా అందులో కిర్సనాయిలు ఉండదు దానికి విలువఏమీ ఉండదు. జ్ఞానిదృష్టిలో ఈప్రపంచంకూడా అంతే. జ్ఞాని ప్రపంచం, ప్రపంచం అంటాడుగాని

ఇందులో ఏమీలేదు, ఇది నిస్సారముఅని జ్ఞానికి తెలుస్తూఉంటుంది. ప్రపంచంలో ఏదీ వాడిని ఆకర్షించదు. ప్రపంచంమీద భ్రాంతిఉన్నవాడికి ప్రపంచంమీద ఆకర్షణ కలుగుతుంది. ప్రపంచంమీద భ్రాంతిని ఏమనస్సుఅయితే కలుగజేస్తోందో ఆమనస్సు హృదయంలో లయమయినతరువాత ఇంక ప్రపంచంమీద ఆకర్షణ ఏమిఉంటుంది.

ఎండలో వెళుతున్నావుఅనుకో చెట్టును ఆశ్రయిస్తే నీకు తాపం నశిస్తుంది. నీవుచెట్టును ఆశ్రయించకపోతే చెట్టుది తప్పుకాదు. తప్పునీదే. నీవు ఏదైనా దుఃఖంతో బాధపడుతున్నావుఅనుకో భగవంతుడిని ఆశ్రయించు నీదుఃఖం నశిస్తుంది. భగవంతుని ఆశ్రయించకపోతే భగవంతునిది తప్పుకాదు. నీదేతప్పు అవుతుంది. భగవంతుని ఆశ్రయించాలనే సహృదయం కలగటంకోసం సత్పురుషుల సహవాసం చెయ్యాలి. మనస్సు మనస్సుగా ఉన్నంతసేపు అనుమానాలు, ప్రశ్నలు వస్తాయి. మనస్సు మౌనంలోనికి వెళ్ళినపుడు శాంతిసముద్రంలో ఈదులాడతావు. నిజమైన గురువు మౌనంతోటే బోధిస్తాడు. హృదయం హృదయంతో మాట్లాడేటప్పుడు మాటలతో పనిఏముంది. ఆత్మఅంటే ఎవరో ఎవరో అనుకొంటాము. ఆత్మఅంటే మనమే. ఆత్మగా ఉండటంఅంటే మనంమనంగా ఉండటమే. భగవాన్ నిర్వాణం అయిపోయేముందు ఒకభక్తుడు భగవాన్‌దగ్గరకువచ్చి మీరు చనిపోతున్నారుఅంటే బాగుండదని అమంగళాన్ని ఊహించలేకపోతున్నాను అన్నాడు. అప్పుడు భగవాన్ ఈదేహంఉన్నా, పోయినా మంగళమే. అసలు వస్తువు అమంగళంకాదు, మంగళమే. సత్యం ఎప్పుడూ మంగళమే అన్నారు.

నీవు ఒకరూపంతోగాని, నామంతోగాని తాదాప్యం పొందితే సెపరేషన్ వస్తుంది. తాదాప్యంలేకపోతే సెపరేషన్ రావటానికి అవకాశంలేదు. నామరూపములతో సెపరేట్ I పెరుగుతోంది. నీవు పూజలు, జపాలు, ధ్యానాలు చేస్తున్నావు. నీసాధనవలన సెపరేట్ I తగ్గుతోందో, పెరుగుతోందో చూసుకో. సెపరేట్ I నశించినపుడు సెపరేషన్‌కూడా నశిస్తుంది. అప్పుడు అంతానేనే ఉన్నానుఅని మీకు తెలుస్తుంది. సెపరేట్ I పోయిన తరువాత చూచేవాడు, చూడబడేది, చూడటంఅనే క్రియ మూడూ ఉండవు. అప్పుడు మీరు పోరు మీరు ఎవరో మీకు తెలుస్తుంది. ఏదో నేర్చుకొందాముఅని వెళ్ళనక్కరలేదు సరదాగావెళ్ళి మంచివారిదగ్గర కూర్చొన్నా వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి. నిప్పుదగ్గర కూర్చొంటే వేడితగలాలిఅని మనంకోరుకోనక్కరలేదు వేడిమనకు తగులుతుంది. అలాగే మంచివారిదగ్గరకు వెళితే మనం ఎందుకు వెళ్ళామో దానితో సంబందంలేకుండా వారి వైబ్రేషన్స్ మనమీదపనిచేస్తాయి. గాఢనిద్రలో 8 గంటలు 8 క్షణాలలాగ గడిచిపోతాయి. ఎందుచేతనంటే అక్కడ మనస్సులేదు. పగలు అంత స్పీడుగా గడవదు. ఎందుచేతనంటే అక్కడ మనస్సు వచ్చేస్తుంది. కాలం మనస్సులో ఉంది. నీవు మనస్సును మర్చిపోతే కాలాన్ని జయించగలవు. సముద్రంలోఉన్న నీరువచ్చి భూమిని ముంచివేసింది అనుకోండి అప్పుడు భవనాలు, ఇళ్ళు, చెట్లు, ఎత్తుపల్లాలు ఏమీ కనబడవు. సెపరేషన్ మీకు ఏమీ తెలియదు అంతానీరే కనబడుతుంది వేరుగా ఏమీ కనబడదు. అలాగే రూపంలేని, నామంలేని, ఆకారంలేని, మార్పులేని ఆపరమేశ్వరుడు నీకు వ్యక్తమయినపుడు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, మీదేహం ఏదోరోజు మరణిస్తుంది. మీదేహానికి మరణం రాకముందే మీరు మరణించటం నేర్చుకోండి. మీరు జ్ఞానులుఅయిపోతారు.